కాసులు కురిపిస్తున్న 'ఖేల్'

పటాన్‌చెరు నియోజకవర్గంలోని క్రీడా మైదానాలకు భారీ డిమాండ్ ఏర్పడింది. ఇక్కడి చిన్నారులు, యువకులు విద్యతోపాటు క్రీడలపై ఆసక్తి చూపిస్తున్నారు. ఈ క్రమంలో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నిరంతరం సాధన చేస్తున్నారు. ఉదయం నుంచే మైదానాలకు వెళ్తుండటంతో ప్రాంగణాలన్నీ కిక్కిరిసిపోతున్నాయి. ఈ క్రమంలో కొందరు మైదానాలను అద్దెకు ఇస్తున్నారు. మరికొందరు అకాడమీలను ఏర్పాటు చేసి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)

గ్రౌండ్స్‌ను అద్దెకిస్తున్న పలువురు.. పటాన్‌చెరులో భారీ డిమాండ్





- క్రీడలపై పెరుగుతున్న ఆసక్తి
- స్థలాలను అద్దెకిస్తున్న నిర్వాహకులు
- కోచ్‌లను పెట్టుకుని క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ
- అనుభజ్ఞులు క్రీడా అకాడమీలను ఏర్పాటు చేసుకొని ఉపాధి
- అభివృద్ధికి నోచుకొని ప్రభుత్వ మైదానాలు

పటాన్‌చెరు నియోజకవర్గంలో క్రీడా మైదానాలకు డిమాండ్ నెలకొంది. అలాగే అకాడమీలు ఏర్పాటవుతున్నాయి. దీంతో రోజురోజుకూ క్రీడా ప్రాంగణాలన్నీ కిక్కిరిసిపోతున్నాయి. క్రీడాకారులు, యువకులు సైతం అకాడమీలను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. అన్ని క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. క్రీడా ప్రాంగణంలోని సౌకర్యాలు, కోచ్‌ను బట్టి ఫీజును వసూలు చేస్తున్నారు. కొంత మంది క్రీడా మైదానాలను గంటలవారీగా అద్దెకు ఇస్తున్నారు. ఉద్యోగస్తులు వారి సమయంను బట్టి క్రీడా మైదానాలను అద్దెకు తీసుకొని వారికి నచ్చిన ఆటలు ఆడుకుంటున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో క్రీడా మైదానాలు లేకపోవడంతో అనేక మంది ప్రైవేట్ క్రీడా అకాడమీలను ఆశ్రయిస్తున్నారు.

క్రీడలతో ఆరోగ్యం, క్రమశిక్షణ..

ఈ పోటీ ప్రపంచంలో చిన్నారుల నుంచి పెద్దల వరకు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. దీంతో తల్లిదండ్రులు పిల్లలను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. క్రీడల్లో రాణించే వారికి బంగారు భవిష్యత్‌తో పాటు ఆరోగ్యం, క్రమశిక్షణ వస్తుందని భావిస్తున్నారు. దానికి అనుగుణంగా అకాడమీల్లో చేర్పించి శిక్షణ ఇప్పిస్తున్నారు.

ప్రతిభ కోచ్‌లతో శిక్షణ..

ప్రధానంగా క్రీడా అకాడమీలో నైపుణ్యం కలిగిన కోచ్‌లతో శిక్షణ అందిస్తున్నారు. మెరుగైన సౌకర్యాలు ఉన్న క్రీడా అకాడమీల్లో బ్యాడ్మింటన్‌కు గంటకు రూ.400, నెల శిక్షణకు రూ.7 వేలు, బాక్స్ క్రికెట్‌కు ఉదయం గంటకు రూ.700, రాత్రి సమయంలో రూ.1,000, స్నూకర్ క్రీడలకు గంటకు రూ.250, వాలీబాల్ క్రీడకు నెలకు శిక్షణకు రూ.2 వేలు, స్కేటింగ్‌కు నెలకు రూ.2వేలు, జిమ్నాస్టిక్స్ శిక్షణకు నెలకు రూ.1,500 ఫీజు తీసుకుంటున్నారు.

ప్రైవేట్ అకాడమీలకు డిమాండ్..

అనేక మంది యువకులు, క్రీడాకారులు అకాడమీలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు కోసం పట్టణ ప్రాంతాలలో భూములను లీజుకు తీసుకొని క్రీడా ప్రాంగణాలుగా అభివృద్ధి చేస్తున్నారు. మంచి శిక్షకులతో శిక్షణ అందిస్తున్నారు. వాటికి ఆదరణ ఎక్కువగా ఉండడంతో అనేక మంది ఈ రంగం వైపు మొగ్గు చూపుతున్నారు.

సరైన గ్రౌండ్‌లు లేకనే..

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం క్రీడా మైదానాలను అభివృద్ధి చేయకపోవడంతో అనేక మంది క్రీడలకు దూరమవుతున్నారు. ప్రధానంగా గ్రామీణ క్రీడాకారులు డబ్బు ఖర్చు పెట్టుకొని ప్రైవేట్ క్రీడా ప్రాంగణాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. క్రీడా మైదానాలు లేకపోవడంతో ప్రైవేట్ అకాడమీలకు మంచి డిమాండ్ నెలకొంది.







క్రీడల్లో ప్రోత్సహించాలి



నేటి ఆధునిక యుగంలో చిన్నారులు ఎక్కువగా వీడియో గేమ్స్, సెల్‌ఫోన్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు. వారికి చిన్ననాటి నుంచి క్రీడలపై ఆసక్తి పెంచితే భవిష్యత్‌లో వారికి నచ్చిన క్రీడల్లో రాణిస్తారు. దీంతో చిన్ననాటి నుంచి రోజుకు రెండు గంటల సమయం ఆటల కోసం కేటాయించడం అలవాటుగా మారుతుంది.

– పీ.నాగరాజు, ఎన్9 స్పోర్ట్స్ అకాడమీ, యజమాని తెల్లాపూర్

రెండేళ్లుగా క్రికెట్‌లో శిక్షణ



మా కుమారుడు యశ్వంత్ శర్మ ఐదవ తరగతి చదువుతున్నాడు. రెండేళ్లుగా క్రికెట్‌లో శిక్షణ ఇప్పిస్తున్నాను. రోజూ సాయంత్రం రెండు గంటలు క్రికెట్ కోసం సమయాన్ని కేటాయిస్తున్నాడు. దీని వల్ల చిన్నారులు చురుగ్గా, ఆరోగ్యం ఉంటారు.

– చంద్రబాబు శర్మ, భారతీనగర్ డివిజన్

తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి



క్రీడల్లో రాణించే వారికి బంగారు భవిష్యత్ ఉంటుంది. చిన్నారులు విద్యతోపాటు క్రీడల్లో రాణించే విధంగా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. అథ్లెటిక్స్‌లో జాతీయ, రాష్ట్రస్థాయిలో 30 మెడల్స్ సాధించాను.

– ఏ.శాంతారావు, అథ్లెటిక్స్ క్రీడాకారుడు, వీఆర్ స్పోర్ట్స్ క్లబ్ కోచ్

అద్దెకు క్రీడా మైదానాలు..

ఐటీ ఉద్యోగులు సైతం క్రీడలపై దృష్టి పెడుతున్నారు. నిత్యం పని ఒత్తిడితో ఉండేవారు సెలవు రోజుల్లో, సమయం దొరికినప్పుడు క్రీడా మైదానాలను అద్దెకు తీసుకొని ఆడుకుంటున్నారు. దీంతో ఆయా అకాడమీల నిర్వాహకులు ఉదయం, రాత్రి సమయాల్లో అద్దెకు ఇస్తున్నారు. అక్కడి సౌకర్యాలను బట్టి మైదానాలకు అద్దె నిర్ణయిస్తున్నారు. క్రికెట్‌కు గంటకు రూ.500, ఫుట్‌బాల్ క్రీడకు రాత్రి సమయంలో రూ.3,000, ఉదయం సమయంలో రూ.1,500, వాలీబాల్‌కు గంటకు రూ.500 అద్దె తీసుకుంటున్నారు.



భారీ వర్షాలు.. అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే గాంధీ



గచ్చిబౌలి: ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే గాంధీ సూచించారు. వర్షాల నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలో వర్షాల వల్ల ఎటువంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. వాతావరణ శాఖ సూచనల మేరకు అత్యవసరం అయితేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని చెప్పారు. ముఖ్యంగా విద్యుత్, రోడ్డు, డ్రైనేజీ, మంచినీటి సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారులు, లేదా తమ కార్యాలయాన్ని సందర్శించాలన్నారు.

21,22 తేదీల్లో రాజయోగ రెసిడెన్షియల్ రీట్రీట్

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఈనెల 21,22 తేదీలలో రాజయోగ రెసిడెన్షియల్ రీట్రీట్ కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈ రీట్రీట్ కార్యక్రమాన్ని తెలుగుభాషలో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు తమ పేర్లను ఆన్‌లైన్ ద్వారా, అలాగే బ్రహ్మకుమారీస్ సెంటర్లలో కూడా నమోదు చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



డెలివరీ ప్యాకేజీని విడుదల చేసిన సీఐడీ డా.లావణ్య ఎన్‌జేపి

మాదాపూర్: గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని తెలంగాణ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సైబర్‌క్రైమ్స్ సీఐడి డాక్టర్ లావణ్య తెలిపారు. మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో శనివారం ఐటీ కారిడార్లలోని మహిళల గర్భధారణలో ఆలస్యం, హైరిస్క్ ప్రెగ్నెన్సీలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గర్భిణులకు మాతృదేవోభవ ప్రత్యేక డెలివరీ ప్యాకేజీని విడుదల చేశారు. డాక్టర్ ఎస్వీ లక్ష్మీ మాట్లాడుతూ నేటి జీవనశైలి, ఆలస్యంగా పెళ్లిళ్లు చేసుకుంటున్నారన్నారు. వయస్సు పెరుగుతున్న కొద్దీ సంతానోత్పత్తి స్థాయి తగ్గుతుందన్నారు. మొదటిసారి గర్భం దాల్చడానికి 30 సంవత్సరాల లోపే ప్రయత్నించాలన్నారు. దీని వల్ల ప్రసవాలు హైరిస్క్‌తో కూడుకుంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రవీందర్‌రెడ్డి పరిగే, డాక్టర్ మీనాక్షి, డాక్టర్ సవిత రాథోడ్, సెంటర్ హెడ్ కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పటాన్‌చెరు: ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడలో రూ.1 కోటి 30 లక్షల నిధులతో చేపట్టనున్న శ్మశాన వాటికలకు ప్రహరీ నిర్మాణ పనులకు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి పాల్గొన్నారు.

మంజీరా నీటి బిల్లు సమస్య పరిష్కరిస్తాం

ఆల్విన్‌కాలనీ: ఆస్‌బెస్టాస్ కాలనీలో పెండింగ్‌లో ఉన్న మంజీరా వాటర్ బిల్లును, కబ్జా కోరల్లో చిక్కుకున్న మిత్ర హిల్స్ పార్కును కాపాడతామని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం కూకట్‌పల్లి, హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో ఎన్నో ఏళ్లుగా నెలకొన్న సమస్యలపై కాలనీ వెల్ఫేర్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్‌బెస్టాస్ కాలనీలో మంజీరా వాటర్ బిల్లు చాలా కాలంగా పెండింగ్‌లో ఉందని, అధికారంలో ఉన్న స్థానిక ఎమ్మెల్యే, అధికారులు సమస్యను పరిష్కరించకుండా వాటర్ బిల్లు అసలు కంటే వడ్డీ ఎక్కువగా పెరగడానికి కారకులయ్యారని అన్నారు. అదే విధంగా హైదర్‌నగర్ మిత్రహిల్స్ పార్కును ప్రజా ప్రయోజనాల కోసం వాడుకలోకి తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి రవికుమార్, నరేష్, భూపాల్‌రెడ్డి, బాబుయాదవ్, నర్సింగ్ రావు, సీతారామరాజు, గోపాల్‌రావు, రఘునాథ్, మహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

పండగ ఏర్పాట్లపై డీసీ సమీక్ష

చందానగర్ : వినాయక చవితి పండగను పురస్కరించుకొని చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్యాణ మండపంలో శనివారం వివిధ శాఖల అధికారులతో డీసీ మోహన్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విగ్రహాల నిమజ్జనం నేపథ్యంలో చందానగర్ సర్కిల్ పరిధిలోని చెరువులు, కోనేరుల వద్ద వసతులు ఏర్పాటుతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. విద్యుత్, పోలీస్ బందోబస్తు, పారిశుధ్యం అధికారులతో మాట్లాడారు. చెరువులను శుభ్రం చేయడంతో పాటు కోనేరులో శుభ్రమైన నీటిని నింపాలన్నారు. ఈ సమావేశంలో చందానగర్ సీఐ పాలవెల్లి, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

'అమర్ సొసైటీకి అన్ని అనుమతులు ఉన్నాయి'



సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ సభ్యులు

గచ్చిబౌలి: దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌ను తాము ఆక్రమించలేదని, వాల్టా చట్టం రాకముందే అన్ని అనుమతులు తీసుకున్నామని అమర్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం సొసైటీ సభ్యుడు గోపాలకృష్ణారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రెండున్నర దశాబ్దాల క్రితం అన్ని అనుమతులతో నిర్మించిన మా ఇళ్లు తప్పయితే...దుర్గం చెరువుపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణం కూడా తప్పేనని పేర్కొన్నారు. 1995లోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో హుడా లేఅవుట్‌కు తుది అనుమతి వచ్చిందన్నారు. 2000 సంవత్సరంలో వరదలు వచ్చినప్పుడు ఎలాంటి శాస్త్రీయత లేకుండా ఇళ్లు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తాయని ఇరిగేషన్ అధికారులు మార్కింగ్ చేశారని తెలిపారు. 2022లో ఎఫ్‌టీఎల్ పరిధిలోకి రాదని అదే ఇరిగేషన్ అధికారులు నివేదిక ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు రెవెన్యూ అధికారులు దుర్గం చెరువు విస్తీర్ణం 165 ఎకరాలు అని చెప్పడం సహేతుకంగా లేదన్నారు. నోటీసులపై న్యాయస్థానానికి వెళ్లామని న్యాయవ్యవస్థపై తమకు పూర్తి నమ్మకం ఉందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం విశాఖపట్నంకి చెందిన నాట్యగురువు కూచిపూడి నాగచందన, చందన డ్యాన్స్ అకాడమీ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చారు. ఇందులో శుక్లాంభరధరం, మూషికవాహన, భావములోన, తాండవ నృత్యకారి, మహాలక్ష్మి అష్టకం తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు శ్రీనిధి, సంహిత, వేదశ్రీ, కుషిత, శాన్విక్రిష్ణ, సహస్ర, రమ్య, శ్రీవాసు, పర్ణిక, నయన, లాస్య, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్యపురంలో నృత్యార్చన



అన్నమయ్యపురంలో..

అన్నమయ్యపురంలో శనివారం అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా తాండవ నృత్యకరి గజానన, అదిగో అల్లదిగో, ఓహో ఎంతటివాడే హరి, కీర్తనలకు హేమప్రియ తన ప్రదర్శనతో అలరించింది. కళాకారిణి కీర్తన స్వరూప్ ఆనందనర్తన గణపతి, రంజని నిరంజని, నారాయణీయం తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులను సంస్థ నిర్వాహకులు సత్కరించారు.

మౌలిక వసతుల కల్పనకు వినతి

మియాపూర్: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. మియాపూర్‌లోని మయూరినగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ కార్పొరేటర్‌కు కాలనీ అసోసియేషన్ సభ్యులు శనివారం వినతిపత్రం అందజేశారు. కాలనీలో అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులు, నీటి సరఫరా, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యలన్నింటినీ దశల వారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మయూరినగర్ కాలనీవాసులు రామరాజు, ప్రవీణ్‌రెడ్డి, వెంకట్‌రావు, మురళీకృష్ణ, చిరంజీవి, లలిత్‌బాబు, అనూష, బాలకృష్ణ, కోటేశ్వర్‌రావు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

పటాన్‌చెరు టౌన్: శని త్రయోదశిని పురస్కరించుకుని పటాన్‌చెరు టోల్‌గేట్ సమీపంలోని రామలింగేశ్వరస్వామి వారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. శనీశ్వరునికి తైలాభిషేకం, రామలింగేశ్వర స్వామికి అభిషేకాలు చేశారు. కాగా స్వామి వారిని పెరుగన్నంతో అలంకరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్.అలివేలు మంగమ్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంగ్లం, తెలుగు, గణితం, హిస్టరీ, కామర్స్, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులలో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్ 3వ తేదీ మధ్యాహ్నం 2 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదే రోజు ఇంటర్వ్యూలు జరుగుతాయని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వ్యక్తిగతంగా సమాచారం ఇవ్వరని తెలిపారు. సంబంధిత సబ్జెక్టులలో పీజీ 55% (ఎస్‌సీ, ఎస్టీ 50%) నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు 12 నుంచి 5 గంటల లోపు కళాశాలలో తమ దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

క్రీడా పోటీల్లో బీవీబీ విద్యార్థుల ప్రతిభ



సాక్షి సిటీబ్యూరో: జాతీయస్థాయి క్రీడా పోటీల్లో భారతీయ విద్యాభవన్స్ విద్యార్థులు ప్రతిభ చూపారు. అలియా ఫాతిమా, దివ్య స్నేహిత, శుభాంగ్, వజ్రలను జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు ,ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి అమూల్య మెమెంటోలతో శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాశాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీవాణి, హెచ్‌ఎం భాను తదితరులు విద్యార్థులను, పీఈటీలను అభినందించారు.

మంత్రులు చెప్పినా.. కానరాని మరమ్మతులు

- రహదారులన్నీ ఛిద్రం
- ఇంకా దృష్టిసారించని ఇంజనీర్లు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- గణేశ్ ఉత్సవాల నాటికి రోడ్లు బాగయ్యేనా..?



బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12 ఎమ్మెల్యే కాలనీ రమేష్ సెలూన్ చౌరస్తాలో గుంతలు తేలిన రోడ్డు

బంజారాహిల్స్: మంత్రులు చెప్పినా మరమ్మతుల మాటే లేదు. ఇంకా ఛిద్రమైన రహదారులే దర్శనమిస్తున్నాయి. అసలే వర్షాకాలం రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. మరోవైపు వినాయక చవితి పండగ సమీపిస్తోంది. గణేశ్ ఉత్సవాల నాటికి రహదారులపై గుంతలు లేకుండా మరమ్మతు చేయాలని మంత్రులు గట్టిగా చెప్పినా అధికారులు పట్టించుకోలేదు. సెప్టెంబర్ 7వ తేదీ పండగ కాగా నవరాత్రులు పూర్తయ్యే 17వ తేదీన విగ్రహాల నిమజ్జనం జరగనుంది. ఇప్పటికే హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబులు వివిధ విభాగాల అధికారులతో నాలుగు రోజుల క్రితం గణేష్ ఉత్సవ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించి రోడ్లపై గుంతలు పూడ్చాలని జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. ఆగస్టు 17న జరిగిన సమీక్షా సమావేశంలోనూ మంత్రి పొన్నం ప్రభాకర్ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి సమక్షంలోనే పండుగ నాటికి రోడ్లపై గుంతలు పూడ్చాలని, ఇదే మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలని సూచించారు. అయితే ఇప్పటిదాకా ఎక్కడా పనులు ప్రారంభం కాలేదు.

వారం ముందుగానే విగ్రహాల తరలింపు..

రోడ్లపై గుంతలు ప్రజలకు పరీక్షగా మారాయి. సెప్టెంబర్ 7న పండగ సందర్భంగా వినాయక విగ్రహాలను మండపాలకు తరలించే కార్యక్రమాలు వారం ముందుగానే ప్రారంభమయ్యాయి. వినాయక విగ్రహాలను మండపాలకు తరలించేటప్పుడు కూడా ఇక్కట్లను దృష్టిలో పెట్టుకుని భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా, విగ్రహాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రోడ్లపై గుంతలు పూడ్చాలని ఉత్సవ కమిటీ నేతలు కూడా డిమాండ్ చేశారు. అయితే గుంతలు పూడ్చటంలో ఇంకా ఇంజనీరింగ్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ నిర్వాకం అడుగడుగునా కళ్లకు కడుతోంది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12లోని ఎమ్మెల్యే కాలనీ రమేష్ సెలూన్ చౌరస్తాలో రోహిణ్ రెడ్డి ఇంటికి ఇవతల రోడ్డంతా ధ్వంసమై రెండేళ్లు కావస్తున్నా ఇప్పటిదాకా మరమ్మతులు చేపట్టలేదు. రోడ్డు నంబర్-12 నుంచి ఏసీబీ కార్యాలయానికి వెళ్లే రోడ్డంతా ఛిద్రమైంది. వాహనాలు ఈ గుంతల్లో పడి ఊగుతున్నాయి. గణేష్ విగ్రహాలను తీసుకువెళ్లే వాహనాలు ఈ గుంతల్లో ఎక్కడ బోల్తాపడతాయోనని ఉత్సవ కమిటీ ప్రతినిధులు బిక్కుబిక్కుమంటున్నారు. జూబ్లీహిల్స్, శ్రీనగర్‌కాలనీ, పంజగుట్ట, సోమాజిగూడ, ఖైరతాబాద్ చింతల్‌బస్తీ, ఫిలింనగర్, బంజారాహిల్స్, అమీర్‌పేట.. ఇలా ఎక్కడ చూసినా ప్రధాన రోడ్లతోపాటు బస్తీలు, కాలనీలకు వెళ్లే అంతర్గత రహదారులు కూడా గుంతలమయమయ్యాయి.



ప్రతిఏటా మొత్తుకుంటున్నా..

వినాయక నిమజ్జనంలో గుంతలతో ఇబ్బందులు వస్తున్నాయంటూ ప్రతియేటా సమావేశంలో మొత్తుకుంటున్నా గుంతలు మాత్రం మరమ్మతులకు నోచుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనైనా నిమజ్జన శోభాయాత్ర గుంతలు లేని రోడ్లపై ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా, ఊగిసలాటలు లేకుండా కొనసాగుతుందా? అనే సందేహం సర్వత్రా వ్యక్తమవుతోంది. కాగా బంజారాహిల్స్‌లోనే ఆరేడు చోట్ల రోడ్లు శిథిలమయ్యాయి. ఇక ఫిలింనగర్ బస్తీల్లో రోడ్ల పరిస్థితి చెప్పనలవి కాదు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



స్కూల్ ప్రారంభోత్సవంలో ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి: నల్లగండ్లలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్లాసమ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను శనివారం ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ నాయకుడు ఎం.రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్లు గంగాధర్‌రెడ్డి, రాగం నాగేందర్‌యాదవ్, ఆర్ శేషగిరిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. విద్యతో పాటు సంస్కృతి, సాంప్రదాయాలపై అవగాహన కల్పించాలన్నారు. బ్లాసమ్స్ స్కూల్ డైరెక్టర్లను అభినందించారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్, నాయకులు మిరియాల రాఘవరావు, లక్ష్మీనారాయణ గౌడ్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం



వరీష్ (ఫైల్)

మియాపూర్: వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ రాష్ట్రం కడపకు చెందిన నీలం వరీష్(38) గోకుల్ ప్లాట్ కాలనీలో ఉంటూ స్థానికంగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆగస్టు 6వ తేదీ పనికి వెళ్లకుండా ఇంటినుండి వెళ్లిపోయాడు. దీంతో యజమాని మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వరీష్ స్థానికంగా అప్పులు చేసి వెళ్లినట్లు యజమాని తెలిపారు. ఈ మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మరో ఘటనలో యువతి..



ప్రీతి సల్మా(ఫైల్)

మియాపూర్ మయూరి నగర్‌లోని శక్తిసాధన్ ఆశ్రమం నుంచి ఓ యువతి అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ప్రీతి సల్మా(20) ఆగస్టు 24వ తేదీ మహబూబ్‌నగర్ చైల్డ్ వెల్ఫేర్ సంస్థ వారు నగరానికి తీసుకువచ్చి శక్తిసాధన్ ఆశ్రమంలో చేర్పించారు. కాగా మరుసటి రోజు 25వ తేదీ ప్రీతి సల్మా ఆశ్రమం నుంచి వెళ్లిపోయింది. తిరిగి రాకపోవడంతో ఆశ్రమ నిర్వాహకులు మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.